క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారి పల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారాముల ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. కుంభాభిషేకం, గణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, నాదమునిరెడ్డి, నాగరాజ ప్రసాద్, భాస్కరరెడ్డి, కేశవమూర్తి రెడ్డి, ప్రసాద్, మధు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

పులిచెర్ల(కల్లూరు): సచివాలయ ఉద్యోగులు సమయ పాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. దిగువపోకల వారిపల్లె సచివాలయాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యూనిఫాం ధరించాలని, అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలన్నారు. రికార్డులను పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర, గంగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా తిరుప్పావడ సేవ



పుంగనూరు: పట్టణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో చివరి రోజైన గురువారం మహాశాంతి అభిషేకం, తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఉదయం అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. శ్రీవేంకటేశ్వర స్వామి కీర్తనల ఆలాపనలతో ఆలయం భక్తిపారవశ్యమైంది. రాత్రి శయనోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

పలమనేరు: సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. రాష్ట్ర సంఘ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆర్వో ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. ఆమేరకు వారు ఓ వినతిపత్రాన్ని కమిషనర్ కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఇందులో జయప్రకాష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

పలమనేరు: పట్టణంలోని రఘువీరారెడ్డి కాలనీలో గంజాయి విక్రయిస్తున్న డానియల్ అనే యువకుడిని పట్టుకుని, ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ నాగరాజు గురువారం తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

టెన్త్ ప్రిఫైనల్ ప్రారంభం

పలమనేరు: మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గురువారం టెన్త్ విద్యార్థులకు ప్రిఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 17వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. పట్టణంలోని పలు పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ తీరును ఎంఈవో లీలారాణి పరిశీలించారు. ఈ పరీక్షలు రానున్న పబ్లిక్ ఎగ్జామ్స్‌కు ఉపకరిస్తాయని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



కమలమ్మ మృతదేహం

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ నక్కపల్లి సమీపంలోని కౌండిన్య చెక్ డ్యామ్‌లో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతురాలు బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లికి చెందిన కమలమ్మ(46)గా స్థానికులు చెబుతున్నారు. ఈమెకు గ్రామంలో జగనన్న పక్కా ఇల్లు సైతం మంజూరైందని, ఆ గ్రామంలో కొంత భూమిని సైతం కొనిందని తెలిసింది. గురువారం ఉదయం నక్కపల్లిలోని ఓ దుకాణం వద్ద చాలాసేపు ఎవరితోనో సెల్‌లో మాట్లాడిందని, తరువాత ఎవరి బైక్‌లోనో ఆమె నక్కపల్లి మూతబడిన ఐరన్ ఫ్యాక్టరీ మార్గంలో వెళ్లినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. నీటిలో పడి మృతిచెంది ఉంటే రెండురోజుల తర్వాత శవం తేలుతుందని, కానీ గంటల వ్యవధిలోనే శవం ఎలా బయటపడిందని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈమె కుమార్తెను పోలీసులు విచారిస్తున్నారు.

సంక్షేమానికి ఓటు వేయండి



కుప్పం: ఎన్ కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ భరత్



పాతురునత్తంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

కుప్పంరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైఎస్సార్ సీపీ మద్దతు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ కోరారు. గురువారం మండల పరిధిలోని ఎన్.కొత్తపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్, సచివాలయ వ్యవస్థలు, ఉద్యోగ మేళాలు, పలు నోటిఫికేషన్ల ద్వారా లక్షలాదిగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. పట్టభద్రులకు మంచి జరగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా పేర్నాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని కోరారు. విద్యావంతులైన పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. సేవాభావం కలిగిన పేర్నాటిని అభ్యర్థిగా ముఖ్యమంత్రి ప్రకటించారని, మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురుగేష్, స్థానిక నాయకులు ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

శాంతిపురం: వైస్సార్ సీపీ మద్దతు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోటీ పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ కోరారు. గురువారం బోయనపల్లి, కెనమాకులపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. చంద్రబాబు హయాంలో యువతకు కేవలం 34,108 ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 6.20 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, వాటిలో 2.07 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఉన్నాయని గుర్తు చేశారు. పారిశ్రామిక అవసరాలకు అవసరమైన స్కిల్స్ పెంపొందించే శిక్షణలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ సమీట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలో పెట్టేందుకు పారిశ్రామిక దిగ్గజాలు ముందుకు వచ్చారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలు, దేశంలోని ప్రముఖ కంపెనీలు సీఎంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. ఆయన నాయకత్వాన్ని మరింత బలపరచేలా ఎమ్మెల్సీ ఎన్నికలలో తిరుగులేని ఆధిపత్యం ఇవ్వాలని కోరారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, ఎంపీటీసీ సభ్యుడు రాజప్ప, నాయకులు జగదీష్, అప్పిరెడ్డి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెజారిటీతో గెలిపించండి

బైరెడ్డిపల్లె: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులను కలసి కరపత్రాలను అందజేసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సూర్యప్రభపై శ్రీరామచంద్రుడు



సూర్యప్రభ వాహనంపై స్వామివారు

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీకోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆవరణలో చక్రస్నానం నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ కోదండరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. దివంగత ఎద్దులింటి వెంకటమునిరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి మణి ఆచారి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శుక్రవారం స్వామి వారికి సప్తవర్ణ మంగళ హారతులు, కల్పవృక్ష వాహన సేవ, పుష్పయాగం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అవాస్తవ ఆరోపణలు చేస్తే సహించం

పెద్దపంజాణి: ఎంతో చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చి రాజకీయాల్లో మచ్చలేని మనిషిగా పేరు తెచ్చుకున్న మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డిపై అవాస్తవ ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరో పెద్దపంజాణి మండలానికి చెందిన వ్యక్తి ఉద్యోగాల పేరిట మోసం చేస్తే విజయ భాస్కర్ రెడ్డి ప్రధాన అనుచరుడని ఓ పత్రికలో ప్రచురించారని, ఇది ఉద్దేశ్యపూరకంగా ఎవరో గిట్టనివారి పనే తప్ప నిజం కాదన్నారు. పుంగనూరు సమితి ప్రారంభం నుంచి రద్దేయ్యే వరకూ ఆయన తండ్రి ఓబుల్ రెడ్డి సమితి అధ్యక్షులుగా ఎంతో మందికి సహాయం చేశారన్నారు. ఆయన స్ఫూర్తిగా రాజకీయాలకు అతీతంగా ఆయన తనయుడు విజయభాస్కర్ రెడ్డి పేదలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. కావాలనే నీచమైన రాజకీయం చేస్తే సహించేది లేదన్నారు. సర్పంచ్‌లు సుబ్రమణ్యం రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, నాయకులు సన్నప రెడ్డి, అమరనాథ్, మంజునాథ్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వరసిద్ధుని ఆలయానికి రూ.42.14 లక్షల ఆదాయం



కాణిపాకం ఆలయంలో టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి వివిధ టెండర్ల ద్వారా రూ.42.14 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. గురువారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో భవనాలు, దుకాణాలను సంవత్సర కాలానికి పలు టెండర్లు నిర్వహించారు.

రూ.2.5 లక్షల విరాళం

ఆలయానికి అనంతపురానికి చెందిన దాత చౌడేశ్వరి రూ.2.5 లక్షలు విరాళంగా అందజేశారు. నిత్యాన్నదానానికి రూ.లక్ష, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1.5 లక్షలు ఈఓ వెంకటేశుకు అందించారు.

25న పాలకమండలి సమావేశం

ఆలయ పాలకమండలి సమావేశం ఈ నెల 25న శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. అధికారులు, పాలక మండలి సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

రొంపిచెర్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని పీహెచ్‌సీ వైద్యాధికారి రాజా అన్నారు. గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. ప్రైవేటు ఆస్పత్రులలో డబ్బులే ధ్యేయంగా అవసరం లేకున్నా సిజేరియన్లు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరం అయితేనే ఆపరేషన్ చేస్తామని పేర్కొన్నారు. ఏఎన్‌ఎం సహాయకారిగా ఉంటుందని, తల్లీబిడ్డ వాహనాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల రాణింపు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ

కుప్పంరూరల్: అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కళాశాలలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజంలో నైతికత, విలువతో కూడిన సమాజాన్ని తయారు చేయడంతో మహిళదే కీలకపాత్ర అని తెలిపారు. ఉమెన్ సెల్ అధ్యాపకురాలు శైలజ, విజయలక్ష్మి, రామసుబ్బారెడ్డి, మాధవి, ప్రవీణ, రాజ్యలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



వెంకటేష్



సన్మానం అందుకున్న ఫక్రుద్దీన్ షరీఫ్

పుంగనూరు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు పార్టీ అప్పగించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని పటిష్టపరిచేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా కోరారు. నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, వాణిజ్య విభాగం ఇన్‌చార్జ్ వెంకటేష్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్ సన్మానించి, కేక్ కట్ చేశారు. కౌన్సిలర్ మనోహర్, నాయకులు కొండవీటి నరేష్, రమణ, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీపీ రంజిత్‌షా

పలమనేరు: మహిళలకు చట్టం ఓ ఆయుధం లాంటిది, విద్యార్థినిలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అడిషనల్ పీపీ రంజిత్ షా సూచించారు. గురువారం పట్టణంలోని శ్రీవజ్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ వింగ్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉంటే ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. దిశ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు వాసు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్టు

పలమనేరు: పట్టణంలోని రఘువీరారెడ్డి కాలనీలో ఇంటిలోనే కర్ణాటక మద్యం విక్రయిస్తున్న లక్ష్మి, ప్రమీల అనే ఇద్దరు మహిళలను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. వీరినుంచి 87 టెట్రా ప్యాకెట్లు, రెండు 750 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కాలనీలో కొందరు మద్యం అమ్మడమే వృత్తిగా చేసుకున్నారని, వీరిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి



మాట్లాడుతున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి లభిస్తుందని మండల వైద్యాధికారి విజయ్‌చంద్ర సూచించారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో గురువారం మహతీ ఫౌండేషన్ సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే రోగ నిరోధక శక్తి వస్తుందని, పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. తల్లిపాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని తెలిపారు. ఫ్యామిలీ వైద్యాధికారి శాలిని, సీహెచ్‌ఓ అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

డీసీసీబీ పథకాలపై అవగాహన



కళాజాత బృందానికి సన్మానం

కుప్పం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం గురువారం ఖాతాదారులకు అవగాహన కల్పించింది. గురువారం కుప్పం బ్రాంచ్ ప్రాంగణంలో మహిళా సంఘాలకు, ఖాతాదారులకు పాటలు, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. రుణాలు, ఇన్సూరెన్స్ పథకాలు, సహకార బంధు పథకం ప్రయోజనాలను వివరించారు. కళాజాత బృందం మహేష్, చిరంజీవి తదితరులను బ్యాంక్ మేనేజర్ గణేష్ సన్మానించారు.

ఘనంగా మహిళా దినోత్సవం



చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మను సన్మానించారు. మహిళా ఉపాధ్యాయులను కూడా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఉపాధ్యాయులు సుధాకర్, మురళీ, దేవదానం, శివప్రసాద్, శ్రీనివాసన్, రామచంద్ర పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



పుంగనూరు రహమత్‌నగర్‌లో మైనారిటీ నాయకుల ప్రచారం



రొంపిచెర్ల: ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి



పెద్దపంజాణి : ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు



గంగవరం : ప్రచారంలో నాయకులు



పలమనేరులో ఇంటింటి ప్రచారం



సోమల: ప్రచారంలో నాయకులు



పుంగనూరు బజారువీధిలో చైర్మన్ అలీమ్‌బాషా, రేష్మా ప్రచారం



సదుం: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పలమనేరు: ఈనెల 13న జరుగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వత రెడ్డిని గెలిపించాలని పట్టణంలోని ఆయా వార్డు కౌన్సిలర్లు గురువారం ఓటర్ల ఇంటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ ప్రచారాల్లో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్లు రెహానా షబ్బీర్, సల్మాశ్యామ్, రమేష్ రెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు పలు ప్రాంతాల్లో ముమ్మర ప్రచారం చేశారు. గురువారం పట్టణంలోని బజారువీధిలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాయలసీమ జిల్లాల వాణిజ్య విభాగం ఇన్‌చార్జ్ వెంకటేష్, కౌన్సిలర్ రేష్మా ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ సాజిదాబేగం ఆధ్వర్యంలో రహమత్‌నగర్, యూబికాంపౌండులో ప్రచారం చేశారు. ప్యాలెస్ కాంపౌండులో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అవుల అమరేంద్ర, కొత్తపేటలో కౌన్సిలర్ భారతి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయకృష్ణ, ఎన్ఎస్.పేటలో కౌన్సిలర్ రాఘవేంద్ర, మంగళం కాలనీలో కౌన్సిలర్ నరసింహులు ప్రచారాలు నిర్వహించారు. ఈ ప్రచారాలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, పీఎల్ శ్రీధర్, సురేష్, రవి, భానుప్రకాష్, వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల మండలంలో..

సోమల: మండలంలోని నంజంపేటలో వైఎస్సార్ సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నాయకులు కరపత్రాలు పంచారు. మాజీ ఎంపీపీ ఝాన్సీలక్ష్మి, సచివాలయ మండల కన్వీనర్ రాశెట్టి మధు, సర్పంచ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కోగిలేరు, రాయలపేట, పెద్దకాప్పల్లి, నాగిరెడ్డిపల్లి, కొలత్తూరు, వీరప్పల్లి సచివాలయాల పరిధిలోని గ్రాడుయేట్లు, ఉపాధ్యాయులను కలసి కరపత్రాలు అందజేశారు. ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, కోఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, తమ్మిరెడ్డి, సుహేబ్, మాకయ్య, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గంగవరంలో

గంగవరం: ప్రజాప్రతినిధులు వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పలు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండ కన్వీనర్ మోహన్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు శ్రీరాములురెడ్డి, చంద్రప్ప, గిరిరాజారెడ్డి, చలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి గెలపించాలని జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి అన్నారు. మోటుమల్లెల పంచాయతీలో ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు విజయశేఖర్, సర్పంచ్ జీవలత, నాయకులు వెంకటనాగులు, శ్రీనాథనాయుడు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. తిమ్మానాయనపల్లె, రెడ్డివారిపల్లె, అమ్మగారిపల్లెలో ప్రచారం చేసి, కరపత్రాలను పంపిణీ చేశారు. సచివాలయ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్‌లు మురళీరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీదేవి, నాయకులు రమేష్‌రెడ్డి, వెంకటరమణాచారి, శ్రీనివాసులు, వాసు పాల్గొన్నారు.